నమస్తే తెలంగాణ | మంగళవారం 22 ఏప్రిల్ 2025
TUESDAY, APRIL 22, 2025

## నేడు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రాక

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 21 : మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మంగళవారం చేవెళ్లకు రానున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్వర్గీయ ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కేంద్రంలోని ఆయన విగ్రహానికి సబితారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

**నేడు స్వర్గీయ ఇంద్రారెడ్డి వర్ధంతి**

**చేవెళ్ల రూరల్ :** మాజీ హోం శాఖ మంత్రి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని కౌకుంట్లలో ఆయన సమాది వద్ద నిర్వహించే కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరవుతున్నారని డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇంద్రారెడ్డి అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పాడి రైతుకు అండగా బీఆర్ఎస్ నాయకులు



పాడి రైతుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కేశంపేట, ఏప్రిల్ 21 : పిడుగు పాటుకు పాడిఆవు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలు బాధిత రైతు బడ్క సత్యనారాయణకు అండగా నిలిచారు. మండల పరిధిలోని నిర్దవెల్లిలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంలో పిడుగుపడి పాడి ఆవు మృతి చెందింది. స్పందించిన బీఆర్ఎస్ నేతలు షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ సహాయంతో రూ.5వేల నగదును సోమవారం రైతుకు అందజేశారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు బడ్క వెంకటయ్య, పి.కృష్ణయ్య, వెంకటేశ్‌ముదిరాజ్, రంగయ్య, మల్లయ్య, జంగాచారి, నిరంజన్, రాములు, నాగరాజు, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలం




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్

యాచారం, ఏప్రిల్ 21: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బావికాడి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ మండల స్థాయి విస్తృత సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో రాష్ట్రంలో ఆ రంగం కుంటు పడుతుందన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25, 26, 27న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మహా సభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదగోని అజయ్, ప్రధాన కార్యదర్శిగా కంబాలపల్లి విప్లవకుమార్, ఉపాధ్యక్షులుగా భాస్కర్, ప్రేమ్‌కుమార్, రోహిత్, సహాయ కార్యదర్శిగా తరుణ్, రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, వంశీ, తరంగ్, శివ, గోపాల్, క్రాంతి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తాం


- చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ
- ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రకళ

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 21 : ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తెలిపారు. సోమవారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి రెండు ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ఈ ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిశీలించిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజావాణిలో షాబాద్ మండల పరిధిలోని కక్కులూర్ నుంచి కంపౌండ్ వాల్‌కు సంబంధించి ఒకటి, శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిల నుంచి భూ సమస్యపై మరో ఫిర్యాదు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ సంధ్య, ఆపరేటర్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు పల్లె శ్రీనివాస్‌గౌడ్

ఆదిబట్ల, ఏప్రిల్ 21 : మున్సిపాలిటీ పరిధిలోని నిరు పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని బీఆర్ఎస్ నాయకుడు పల్లె శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిబట్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 45లో 19 ఎకరాలు, 72/2లో 4 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుతో భూములు కోల్పోయిన బాధితులకు అప్పట్లో ప్లాట్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## స్థానికత కోల్పోయిన ఉద్యోగులను బదిలీ చేయాలి



చలో హైదరాబాద్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ఆమనగల్లు, ఏప్రిల్ 21: 317 జీవో కారణంగా స్థానికత కోల్పోయిన ఉద్యోగులను వెంటనే సొంత జిల్లాలకు బదిలీ చేయాలని బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, మల్లేశ్ ప్రభుత్వాన్ని కోరారు. దీనిని నిరసిస్తూ రాష్ట్ర జేఏసీ ఈ నెల 25న తలపెట్టిన చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వారు స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జీవోతో దాదాపు 10 వేల మంది స్థానికత కోల్పోయారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఈ నెల 25న నిర్వహించే కార్యక్రమానికి బాధితులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రియాజుద్దీన్, మహేశ్, అలివేలు, ఆనంద్, జ్ఞానేశ్వర్, పవన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్దవెల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నీటిశుద్ధి కేంద్రం

కేశంపేట, ఏప్రిల్ 21: మండల పరిధిలోని నిర్దవెల్లిలో ఉన్న జడ్పీహెచ్ఎస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని సోమవారం సీఐ నరహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని కుకట్‌పల్లికి చెందిన చలసాని ప్రతీక, చలసాని హన్సిక తమ పాకెట్ మనీ రూ.50వేల ఖర్చుతో జెడ్పీహెచ్ఎస్‌లో నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బులను వృథా చేయకుండా సమాజానికి ఉపయోగపడేలా చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం దాతలను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, విజయ్, కరుణాకర్‌గౌడ్, కృష్ణారెడ్డి, లత, భూదేవి, గంగమ్మ, సుమలత, అరుణ, శ్రీశైలం, జంగయ్య, ముత్యాలు, సురేందర్, మల్లయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.



సీఐతోపాటు దాతలను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

## షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి బదిలీ



బదిలీపై వెళ్తున్న సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మికి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న న్యాయవాదులు

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 21 : షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జిగా సేవలందించిన రాజ్యలక్ష్మి ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న ఆమెను సోమవారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సభ్యులతో పాటు న్యాయవాదులు పుష్పగుచ్ఛాలు అందజేసి వీడ్కోలు పలికారు. మూడేండ్లకు పైగా ఆమె ఆందించిన న్యాయ సేవలను కొనియాడారు. ఆమె స్థానంలో షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జిగా సిద్దిపేట నుంచి స్వాతిరెడ్డి రానున్నారని న్యాయవాదులు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్, సభ్యులు, న్యాయవాదులు రాజగోపాల్ పాల్గొన్నారు.

## విద్యార్థులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి



తిమ్మారెడ్డిగూడలో బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ తదితరులు

షాబాద్, ఏప్రిల్ 21 : తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని షాబాద్ ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని బ్రోచర్లు ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. అనంతరం వారికి అవగాహన కల్పించారు. తిమ్మారెడ్డిగూడ పాఠశాలలో చదువుతున్న విద్యార్థికి గురుకుల పరీక్షల్లో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ రావడం సంతోషకరమన్నారు. ఆ విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరి మల్లేశ్, మాజీ సర్పంచ్ మద్దూరి శకుంతల, మాజీ ఎంపీటీసీలు మద్దూరి పాండు, గుత్తి సునీత, నాయకులు రామస్వామి, చెన్నయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మంచాల, ఏప్రిల్ 21 : మండల పరిధిలోని ఆరుట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 1994-95లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం కాగజ్‌ఘట్‌లోని సిరి నేచర్ వ్యాలీలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. ఒకరినొకరిని ఆత్మీయంగా పలకరించుకున్నారు. గతంలో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్, రంగారావు, నర్సింగ్ రావు, యాదయ్య గౌడ్ రవికుమార్‌ను సన్మానించారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు ఎండీ సలాం, తిరుమల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, సుజాత, మమత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల విక్రయానికి అవకాశం కల్పించాలి

మొయినాబాద్, ఏప్రిల్ 21 : హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్‌లో ఉన్న మార్కెట్‌లో రైతులు కూరగాయలు విక్రయించేందుకు అవకాశం కల్పించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. మార్కెట్‌లో కూరగాయలు రిటైల్‌గా అమ్మరాదని, హోల్‌సేల్‌గా విక్రయించి వెళ్లాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు నిబంధనలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో స్వేచ్ఛగా కూరగాయలు విక్రయించేందుకు అవకాశం కల్పించాలని వారు కోరారు. స్పందించిన మల్లేశ్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు, రైతు సంఘం అధ్యక్షుడు కొమ్మిడి దశరథ్‌రెడ్డి, ఫిషర్‌మెన్ కమిటీ జిల్లా చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రైతులు రవీందర్ రెడ్డి, కిష్టయ్యయాదవ్, మల్లేశ్‌ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వీరారెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### బంగారు గొలుసు చోరీ

మంచాల, ఏప్రిల్ 21 : మండల పరిధిలోని దాద్‌పల్లికి చెందిన మల్కాపురం సత్తమ్మ మెడలో నుంచి 3 తులాల బంగారు గొలుసును దుండగులు అపహరించుకు వెళ్లారు. సీఐ మధు తెలిపిన వివరాలు.. సోమవారం మధ్యాహ్నం దాద్‌పల్లిలో మేకలను మేపుతున్న సత్తమ్మ దగ్గరికి ఇద్దరు వ్యక్తులు వచ్చి మాట్లాడుతుండగా మరో వ్యక్తి ఆమె మెడలోనుంచి పుస్తెల తాడును లాక్కొని రోడ్డుపై ఉన్న మరో వ్యక్తితో కలిసి బైక్‌పై పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

### ప్రభుత్వ భూమిని రక్షించండి

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 21: మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారంలో సర్వే నంబర్ 73లోని ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేసి భూమిని రక్షించాలని తట్టిఅన్నారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు నల్ల ప్రభాకర్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సర్వేనంబర్ 73లో ఉన్న బొందలగడ్డ ప్రభుత్వ భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే భూమిని సర్వే చేసి రక్షించాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## లేడీ అఘోరిపై కఠిన చర్యలు తీసుకోవాలి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మాల మహానాడు నాయకులు

యాచారం, ఏప్రిల్ 21 : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన లేడీ అఘోరి అలియాస్ శ్రీనివాస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కమిటీ ఆధ్వర్యంలో యాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కమిటీ మండల అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ.. అంబేద్కర్‌ను విమర్శించే స్థాయి అఘోరికి లేదన్నారు. అఘోరి చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగానికే అవమానంగా ఉన్నాయన్నారు. అఘోరికి శిక్ష పడేవరకు వదిలి పెట్టేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, లక్ష్మణ్, ధన్‌రాజ్, యాదగిరి, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


## ఉపాధి కూలీలకు ఇన్సూరెన్స్ కార్డులు అందజేత



ఉపాధి కూలీలకు ఇన్సూరెన్స్ కార్డులు అందజేస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, ఏప్రిల్ 21 : మండల పరిధిలోని చైదర్‌పల్లికి చెందిన ఉపాధి హామీ కూలీలకు సోమవారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి ఇన్సూరెన్స్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్సూరెన్స్ కింద రూ.2లక్షల పాలసీని ఎన్జీవో సంస్థ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించి ఆ కార్డులను ఉపాధి కూలీలకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్డులు కూలీలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో లింగయ్య, సిబ్బంది, కూలీలు ఉన్నారు.

## 101 రోజుకు చేరుకున్న భూ బాధితుల దీక్ష



చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 21 : శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ తండా గిరిజ భూ బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నాటికి 101వ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా దీక్షలో భూ బాధితులు మాట్లాడుతూ... తమకు సంబంధించిన 80 ఎకరాల బిలాదాఖల భూములు ఆక్రమించిన పలు రియల్ ఎస్టేట్ కంపెనీ వారిపై ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వేడుకున్నారు. దీక్షలో శంకర్, బాబు, కొండకల్ మాజీ వార్డు సభ్యుడు మర్రివాగు రాజు, గోపి, సోనిబాయి, తులసి, శంకరమ్మ, మాణెమ్మ, పి.కవిత, లక్ష్మణ్, రవి, గిరిజనులు పాల్గొన్నారు.



కొత్తూరు మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం ప్రారంభించారు. బైపాస్ నుంచి కస్తూర్బా హాస్టల్ వరకు సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే శంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్యతో కలిసి ప్రారంభించారు. కొందుర్గులో నూతనంగా నిర్మించతలపెట్టిన గ్రంథాలయ భవన నిర్మాణానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం శంకుస్థాపన చేశారు. - కొత్తూరు/కొందుర్గు, ఏప్రిల్ 21

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మొయినాబాద్, ఏప్రిల్ 21 : మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ బానోతు హము తెలిపారు. ముర్తూజాగూడ ఫీడర్ 11 కేవీ పరిధిలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, విజయనవ్య ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు. ఈ రెండు ఫీడర్ల పరిధిలో విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలను తొలగింపు దృష్ట్యా సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వర్షాకాలంలో ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. మున్సిపాలిటీ పరిదిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### దొంతాన్‌పల్లిలో విద్యార్థిపై కుక్కల దాడి

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 21 : విద్యార్థిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. శంకర్‌పల్లి మండల పరిధిలోని దొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన మహ్మద్ హమీద్ ఐదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి బయట ఆడుకుంటుండగా.. కుక్కలు దాడి చేయడంతో విద్యార్థి తండ్రి మహ్మద్ ఖాదర్ వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కల్యాణ్‌ను వివరణ కోరగా కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 : మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామానికి చెందిన ప్రముఖ సంఘసేవకుడు బాజరు భిక్షపతి కుమార్తె గేటుదిమ్మ కూలి మృతి చెందగా, కుమారుడు కాలు విరిగి మంచం పాలయ్యాడు. విషయం తెలుసుకున్న ఎలిమినేడుకు చెందిన కురుమ సంఘం సభ్యులు సోమవారం రూ.1.54 లక్షల ఆర్థిక సహాయం చేశారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరమున్నా భిక్షపతి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హిందువులపై దాడులను అరికట్టాలి



ఆమనగల్లులో నిరసన ర్యాలీ చేస్తున్న నాయకులు

ఆమనగల్లు, ఏప్రిల్ 21 : పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. దాడులను నిరసిస్తూ సోమవారం ఆమనగల్లు పట్టణంలోని అంగడిబజార్ హనుమాన్ ఆలయం నుంచి పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు బయలుదేరి స్థానిక ఆర్ఐ చెన్నకేశవులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నాయకులు మాట్లాడుతూ.. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకించడం పేరుతో బెంగాల్ మొత్తం హింస కాండతో కాలిపోతుందన్నారు. వెంటనే బెంగాల్‌లో ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ నాయకులు, బీజేపీ మండల, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాసులు, విక్రం రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ కౌన్సిలర్ గోరటి నర్సింహ, కృష్ణాయాదవ్, కృష్ణనాయక్, చెన్నకేశవులు, బీజేవైఎం జిల్లా కో కన్వీనర్ రవి రాథోడ్ సీనియర్ నాయకులు నరేందర్ రాథోడ్ , ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 25 నుంచి ఎస్ఎఫ్ఐ మహాసభలు




కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి జరిగిన అన్యాయంపై నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 21 : ఖమ్మంలో ఈ నెల 25 నుంచి 27వరకు జరిగి ఎస్ఎఫ్ఐ రాష్ట మహాసభలను విజయవంతం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కమిటీ సమావేశం అరుణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు, కార్యకర్తి సమీర్, యశ్వంత్, వివేకానంద, దిలీప్, సహాయ కార్యదర్శులు చరణ్ గౌడ్, చందు, తేజ, పండు, నాయకులు చిరంజీవి, సాయి, గణేశ్, డివిజన్ కమిటీ సభ్యులు దేవేందర్, సాయిగౌడ్, రాహుల్, హరి కృష్ణ, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్, ఏప్రిల్ 21 : క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని ఫెయిర్ యూ మెథడిస్ట్ సెంట్రల్ చర్చి జిల్లా అధికారి రెవరెండ్ విజయరావు అన్నారు. ఈస్టర్ వేడుకలను పురష్కరించుకుని మొయినాబాద్‌లో ఫెయిర్ యూ మెథడిస్ట్ సెంట్రల్ చర్చి ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంటును అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్, టోర్నమెంటు ఆర్గనైజర్లు శాంతికుమార్, అంకిత్, ప్రదీప్, రాహుల్ సమక్షంలో నిర్వహించారు. టోర్నమెంటులో విజేత జట్టుగా ది రైసర్స్ టీమ్, రన్నర్స్‌గా జూడహిట్స్ టీం నిలిచింది. ఈ సందర్భంగా విజేత జట్టుకు షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, బీఆర్ఎస్ నాయకుడు షాబాద్ ప్రవీణ్, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు పూసల పరమేశ్, మాజీ వార్డు సభ్యులు శ్రీనివాస్, చంద్రబాబు, వరప్రసాద్, శ్రీకాంత్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, కొండల్, ప్రవీణ్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

## మే 20న దేశ వ్యాప్త సమ్మె సక్సెస్ చేయాలి



ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందచేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆదిబట్ల, ఏప్రిల్ 21 : మే 20న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆదిబట్ల మున్సిపల్ సీఐటీయూ కన్వీనర్ తులసి గారి నర్సింహ కోరారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు సమ్మె నోటీసు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ జవాన్ యూనియన్ అధ్యక్షులు మల్లారెడ్డి, మల్లికార్జున్, వర్కర్స్ యూనియన్ నాయకులు గణేశ్, ఇందిర, జయ, సదానంద్, యాదయ్య పాల్గొన్నారు.

## గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



షాబాద్ : నాగరకుంటలో పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

షాబాద్, ఏప్రిల్ 21: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నరెడ్లగూడ, నాగరకుంట తదితర గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**అజీజ్‌నగర్‌లో..**

**మొయినాబాద్ :** పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో 245 పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భీంరావు, కుమార్, ఘోరేమియా పాల్గొన్నారు.